# ప్రణవ పద్మాకరం

డిసెంబర్ 25



వైకుంఠ ఏకాదశి శుభాకాంక్షలు



# డిసెంబర్ , 2025

డిసెంబర్ , 2025

## విషయ సూచిక

సంపుటి-4
సంచిక-12


01 సంపాదకీయం — బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్

02 శ్రీ గణేశ పురాణం — శ్రీమతి పాలగుమ్మి శ్రీవిద్య

03 శ్రీ వేంకటేశ్వర రహస్యం — శ్రీమతి నిడుముక్కల శ్రీకరి

04 శ్రీ మత్స్యమహాపురాణం — మద్దూరి వేంకట సుబ్రహ్మణ్య సత్యనారాయణ

05 ఐశ్వర్యయోగం — బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్

06 ఋషిచరిత్ర — శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం

07 కాశీ కథలు — శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం

08 స్తోత్రమాలిక — బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్


09 గురుదేవుల జీవన కవనము — శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం


శ్రీ మహాగణాధిపతయే నమః — శ్రీ గురుభ్యోనమః — శ్రీ మాత్రేనమః

పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారి ప్రవచనముల కొఱకు, శ్రీ ప్రణవపీఠం సమాచారము కొఱకు క్రింద ఇవ్వబడిన వెబ్సైటు ను సందర్శించగలరు.

**https://srivaddipartipadmakar.org**

© All copyrights are reserved with Sri Pranava Peetam, Eluru.




"నేను వైకుంఠాన్ని విడిచి అయినా ఉంటాను కానీ నా భక్తులను మాత్రం విడిచి ఉండలేను" అనేది శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ప్రతిజ్ఞ. స్వామి ఆ ప్రతిజ్ఞను నిలబెట్టుకుంటున్న విధానాన్ని కనులకు కట్టి చూపించే అద్భుత రచన 'శ్రీ వెంకటేశ్వర విలాసం'. స్వామి వారి నివాస స్థలమైన తిరుమల, తిరుమల లోని వివిధ తీర్థములు, వివిధ పర్వతములు, దేవాలయములు, వాటి మహత్తుతో పాటు వాటిని దర్శించవలసిన విధి విధానములు సరళంగా, వివరంగా మనసుకు హత్తుకునే విధంగా వివరించ బడిన ఈ గ్రంథం పఠించిన వారు నిస్సందేహంగా ఆధ్యాత్మిక బల సంపన్నులు కాగలరు.


పూజ్య గురుదేవులు అందించిన పుస్తకముల కొఱకు:

https://shop.srivaddipartipadmakar.org

# సంపాదకీయం

## గురువాక్యం తు కర్తవ్యమ్

శ్రీకృష్ణపరమాత్ముడు జగద్గురువు. వేదోపనిషత్తుల సారాంశాన్ని లోక శ్రేయస్సు కోసం భగవద్గీతా రూపంలో అందించిన కరుణాస్వరూపుడు. మార్గశీర్ష మాసంలో శుక్ల పక్షంలో ఏకాదశినాడు లోకానికి భగవద్గీత అందింది. ఆ తిథిని జ్ఞాన తిథిగా కర్తవ్యతిథిగా, భగవద్గీతా జయంతిగా పండితులు కీర్తిస్తారు. మన ప్రణవపీఠం శ్రీవిద్యానిధి ద్వారా గీతను గ్రహించి, ప్రచారం చేయాలని కోరుతున్నాను. మాసాలలో మార్గశీర్షం తానేనని శ్రీకృష్ణుడు గీతలో స్పష్టం చేసాడు. కనుక ఈ మాసాన్ని సద్వినియోగం చేసుకోవాలి. దత్తజయంతిని డిసెంబరు 3న జరుపుకోవాలా! లేదా 4న జరుపుకోవాలా! అని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కార్తవీర్యుడు రాత్రికి చతుర్దశి ఉండాలని అన్నాడు. పరశురాముడు సూర్యోదయానికి చతుర్ధశి ఉండాలని అన్నాడు. కనుక భక్తులు రెండు దినాల పాటు దత్తుని తలచుకొని మరింత ఫలం



పొందండి. 16/12/2025 మంగళవారం నుండి ధనుర్మాసం ఆరంభం అవుతున్నది. తిరుప్పావై పఠన శ్రవణాలు చేయండి. కాత్యాయనీవ్రతం మార్గశీర్షంలో ఆచరిస్తే అందరికీ శుభమే. పుష్యమాసం 20 వ తేది నుండి ఆరంభం అవుతుంది. పుష్యమాసంలో హరినామ సంకీర్తనం, గొబ్బెమ్మలు పెట్టడం, లక్ష్మీదేవిని పూజించడం వలన ఇహపరాలు లభిస్తాయి. సంపదలు అభివృద్ధి అవుతాయి. వైకుంఠైకాదశి నాడు ముక్కోటి దేవతలు భూలోకానికి వచ్చి శ్రీమహావిష్ణుదర్శనం చేసుకొంటారు. భక్తులు స్థానిక దేవాలయాలలో హరిదర్శనం చేసుకోండి. ప్రసిద్ధ ఆలయాలకు పరుగులు పెట్టక పల్లెలలో గల ఆలయాలను దర్శించండి. మన ప్రణవపీఠం, ఏలూరులో శ్రీరమాసమేత సత్యనారాయణ స్వామి వారిని అవకాశం ఉన్నవారు దర్శించుకొని, వ్రతాలు చేసుకొని శుభాలు పొందగలరు.ఇది కలియుగం. మన సనాతనధర్మానికి ఎన్నో విధాల ఆటంకాలు ఎదురౌతున్నాయి. అన్యమతాలతో బాటుగా మనలోని కొందరు స్వార్ధపరుల దురాలోచనాల వలన శివకేశవ భేదం తలెత్తుతోంది. దుష్టశక్తులను, పారద్రోలి, భేదభావం విడచి, వేదసారం గ్రహించి శివకేశవులకు అభేదం పాటించిన గురుభక్తులు సుఖశాంతులు పొందుతారు. ఇది ఆచరించవలసినదిగా మంగళాశాసనం చేస్తున్నాము. డిసెంబరు 31, జనవరి 1, 2 (2026) లో గురు షష్టి పూర్తి హైదరాబాదులో జరుగుతున్నది. అవకాశం ఉన్నవారు రండి. తరించండి. గురుభక్తిని ఎప్పటికీ విడువక మీమీ వృత్తిధర్మాలను సక్రమంగా నడపుతూ, సుఖశాంతులు పొందగలరని ఆశిస్తూ అనేక మంగళాశాసనాలు చేస్తున్నాము.

వద్దిపర్తి పద్మాకర్

# శ్రీ గణేశ పురాణం



శ్లోII గుహస్యాగ్రే చ జాతోఽయమ్ ఆవిర్భూతో హరాలయే

వందే గుహాగ్రజమ్, దేవం, సర్వదేవాగ్ర పూజితమ్ II

(బ్ర.వై.పు.అ.44.శ్లో.౯4)

శివుని నివాసస్థానమైన కైలాసంలో గుహునకు అనగా కుమారస్వామికి అగ్రజునిగా, అనగా అన్నగారిగా జన్మించడం వలన గణేశుని గుహాగ్రజుడు అన్నారు. సర్వదేవతలలో అగ్రపూజను అందుకొనే దేవుడైన గణపతికి నమస్కారం.

ఫలశ్రుతి :-

శ్లోII ఏతన్నామాష్టకం దుర్గే! నానాశక్తి యుతం పరమ్
ఏతన్నామాష్టకం స్తోత్రం నానార్థ సహితం శుభమ్ II

శ్లోII త్రిసంధ్యం యః పఠేన్నిత్యం స సుఖీ సర్వతో జయీ
తతో విఘ్నాః పలాయంతే వైనతేయాద్యథోరగాః II

శ్లోII గణేశ్వర ప్రసాదేన మహాజ్ఞానీ భవేద్ధ్రువమ్
పుత్రార్థీ లభతే పుత్రం భార్యార్థీ కుశలాం స్త్రియమ్
మహాజడః కవీంద్రశ్చ విద్యావాంశ్చ భవేద్ధ్రువమ్
పుత్రస్తే పశ్య వేదే చ తథాకోపం చ నో కురు II

(బ్ర.వై.పు.అ.44.శ్లో.౯5 నుండి ౯8)

దుర్గా! గణపతి యొక్క ఈ నామాష్టకం అనేక శక్తులతో కూడినది. ఉత్తమమైనది. అష్టకస్తోత్రం అనేక శుభార్థాలతో కూడి, శుభాలను ఇస్తుంది. ఈ స్తోత్రాన్ని మూడు సంధ్యలలో నిత్యం చదివిన వాడు సుఖాలను పొందుతాడు. జయం పొందుతాడు. చదివిన వానికి ఏ పనులలోనైనా విఘ్నాలు ఉండవు. గరుత్మంతుని చూచి పాములు పారిపోయినట్లుగా భక్తుని విఘ్నాలు పారిపోతాయి.

.. ఇంకా ఉంది

# శ్రీ వేంకటేశ్వర రహస్యము

శ్లో॥ వేంకటేశ్వర దేవస్య దర్శనాదేవ కేవలమ్
అపునర్భవదా ముక్తిః భవిష్యత్యవిలంబితమ్
కృమికీటాశ్చ దేవాశ్చ మునయశ్చ తపోధనాః ॥

(శ్రీ.స్కాం.పు.వేం.మా.అ.18.శ్లో.29,30)

శ్రీవేంకటేశ్వర దేవుని దర్శనం చేసుకొన్నంత మాత్రాన కృములు, కీటకాలు, దేవతలు, మునులు, తపస్సు చేసే వారు, ఇలా సకల జీవులు ఏ మాత్రం ఆలస్యం లేకుండా మరల జన్మించనవసరం లేని ముక్తిని పొందుతారు. దర్శనం చేతనే జీవులను ముక్తికి పంపించే పరంధాముడు శ్రీవేంకటేశ్వరుడు. శ్రీనివాసుని దయకు పేదలు, ధనికులు అనే భేదం లేదు. ధనగర్వంతో స్వామిని అడ్డ దారిలో చూసే వారికన్న దూరం నుండి స్వామిని ఏ ధనాహంకారం లేకుండా దర్శించుకొనే సామాన్య భక్తుడే తొందరగా తరిస్తాడు.

శ్లో॥ మాగర్వం క్రియతాం పుణ్యం మయా కారీతి వాజనైః
పాపం కృతం మయానేకమితి మా క్రియతాం భయమ్


శ్లో॥ వేంకటేశే మహాదేవే శ్రీనివాసే విలోకితే
న న్యూనానాధికాశ్చ స్యుః కింతు సర్వే మహాజనాః
వేంకటాఖ్యే మహాపుణ్యే సర్వపాతక నాశనే ॥

(శ్రీ.స్కాం.పు.వేం.మా.అ.18.శ్లో.31,32,33)

నేను పుణ్యాలు చేసాను అని జనులు అహంకరించరాదు. గర్వం పొందరాదు. శ్రీనివాసుడు అహంకార విదూరుడు. నేను పాపాలు చేసాను అని నిరంతరం భయం పొందనవసరం లేదు. పశ్చాత్తాపంతో స్వామి పాదాలను పట్టుకొంటే అన్నీ నశిస్తాయి. దేవాధిదేవుడైన శ్రీనివాసుడు ఒక్క సారి కరుణిస్తే చాలు, ఆయన దర్శనం వల్ల ఎక్కువ వారు, తక్కువవారు అనే భేదాలు నశిస్తాయి. అందరూ మహాత్ములవుతారు. పరమపుణ్యం ప్రసాదించే వేంకటాచలం చేరినంత చేతనే సర్వపాతకాలూ నశిస్తాయి.

శ్రీవేంకటేశ్వరుడు భేదభావాలతో ఉండేవారిని అనుగ్రహించడు. అందువల్ల గొప్పవారికి, ధనవంతులకు దర్శనం కలిగిస్తూ, పేదలను చిన్న చూపు చూసే వారిని శపించి, తనకు దూరం చేస్తాడు. శ్రీనివాసునకు భక్తితో నమస్కరించి, ఒక్కసారి దర్శనం చేసుకొన్నవానికి చతుర్వేద పండితుడు కూడా సరిరాడు. అందుకే మేము వేదాలు చదివాము, శాస్త్రాలు చదివాము అని జనులు అహంకరించరాదు. శ్రీనివాసకృప కల్గినవానికి త్వరగా ముక్తి లభిస్తుంది. అన్నీ చదివినా, తత్త్వజ్ఞానం లేక ఇతరులను కించపరిచే వారికి ఎన్ని జన్మలెత్తినా ముక్తి లభించదు. సర్వ ప్రాణులపై ప్రేమలేనివాని వేదవిద్య, గంగాజలంలోని చేపలు, కప్పలు, మొసళ్ళు ఎలా ముక్తి పొందలేవో అలాగే ముక్తినివ్వదు అని గ్రహించాలి. శ్రీస్వామిని భక్తితో పూజించేవానికి పూజాసామగ్రితో పనిలేదు. హృదయమే సర్వం. స్వామివారిని పూజించే వారి కుటుంబ సభ్యులందఱూ ఈ జన్మలోనే తరిస్తారు. శ్రీనివాసుని సాటి దైవం లేదు. శ్రీనివాసుని సేవకు మించిన సేవలేదు. ఆ సేవ సకల పుణ్యాలను ప్రసాదిస్తుంది. స్వామి ద్రోహం మహాపాపం. స్వామి నామమే వైకుంఠప్రదం.


....ఇంకా ఉంది



## మత్స్యావతార కథనం

నైమిశారణ్యంలో దీర్ఘసత్రయాగం చేస్తున్న మునులు ఏకాంతంగా కూర్చుని ఉన్న సూతమహర్షిని సమీపించి "అనఘా! ఇప్పటివరకు మనోహరములైన కొన్ని పురాణములను వినిపించి ఉన్నారు. అవి అమృతంతో సమానంగా ఉండి ఇంకా వినాలని మాకు వేడుకగా ఉన్నది. ఎంత విన్న తృప్తి కలగడం లేదు. భగవానుడైన శ్రీమహావిష్ణువు ఏ కారణంగా మత్స్యరూపాన్ని ధరించి లోకాన్ని ఉద్ధరించారు. అలాగే పరమశివునికి భైరవుడు, పురారి, కపాలి అనబడే నామాలు కలవు కదా! వీటికి కారణం ఏమిటీ? ఇదంతా విస్తరించి మాకు చెప్పమని వేడుచున్నాము.మునులు అడిగిన విషయములకు సూతుడు ఇలా జవాబు చెప్పడం ప్రారంభించాడు. మునులారా! సాక్షాత్ శ్రీమహావిష్ణువు చెప్పిన మత్స్యపురాణాన్ని మీకు చెపుతాను వినండి. ఈ పురాణం ఎంతో పవిత్రమైంది. పుణ్యాన్నిస్తుంది. ఆయుష్షును పెంచుతుంది. పూర్వం సూర్యభగవానుడి కుమారుడు మనువు అను రాజు ఉండేవాడు. అతడు గొప్ప సంస్కారవంతుడు. క్షమాగుణం కలవాడు. తన కుమారునకు రాజ్యభారము అప్పగించి, తపస్సు చేయడానికి మలయ పర్వతం మీదకు వెళ్ళాడు. ఆత్మసంస్కారమునకు కావలసిన గుణములన్నియు కలవాడై, సుఖదుఃఖములయందు సమదృష్టి కలిగి యుండి ఉత్తమయోగసాధనను అవలంభించాడు. అలా పది లక్షల ఏండ్లు తపస్సు చేసాడు. ఆతని తపస్సుకు మెచ్చిన బ్రహ్మదేవుడు ప్రత్యక్షమై మనువుతో "రాజా! నీ తపస్సుకు సంతోషించాను. ఏదైనా వరం కోరుకో ఇస్తాను" అన్నాడు. అప్పుడు మనువు బ్రహ్మదేవునకు నమస్కరించి ఇలా పలికాడు — "సృష్టికర్తా! అన్నిటికంటె ఉత్తమోత్తమమైన ఒక వరాన్ని కోరుకుంటాను. ప్రళయం సంభవించినప్పుడు స్థావరజంగములగు ప్రాణులను రక్షించే శక్తి నాకు ప్రసాదించు." ఆతని మాటలువిన్న విశ్వమునకు ఆత్మస్వరూపుడైన బ్రహ్మ "తథాఽస్తు" (అట్లే అగుకాక!) అని అక్కడనే అంతర్ధానమయ్యాడు. దేవతలు అప్పుడు ఆకాశం నుండి పూలవాన కురిపించారు. "కొంతకాలం గడిచింది. ఒక రోజున మనువు తన ఆశ్రమ సమీపంలో నదిలో స్నానం చేసి పితృదేవతలకు తర్పణం ఇస్తూండగా ఒక ఆడుచేప నీటితో పాటు ఆతని రెండు చేతుల్లోకి వచ్చింది. దయామయుడైన ఆ రాజు ఆ చేపను రక్షించాలని తన కమండలం లోని నీటిలో వేసాడు. ఆ మత్స్యం ఒక్క అహోరాత్రంలో (పగలు, రాత్రి) పన్నెండంగుళముల పొడవై, రాజుకేసి రక్షించుమన్నట్లు చూసింది. అప్పుడు రాజు ఆ చేపను వెడల్పు మూతి గల ఒక మట్టి పాత్రలో ఉంచాడు. అప్పుడా చేప ఒక్క అహోరాత్రంలో మూడు మూరలంత పెద్దగా పెరిగిపోయింది. సూర్యపుత్రుడగు మనువుతో ఆ చేప "రాజా! నేను శరణు పొందాను. నన్ను రక్షించు, రక్షించు" అంది. అప్పుడు మనువు ఆ చేప మట్టి పాత్రలో ఇమడ లేకపోతోందని గ్రహించి, దాన్ని ఒక బావిలో జార విడిచాడు. అది అక్కడ కూడా ఇమడలేక ఆక్రందన చేయగా, దాన్ని రాజు ఒక సరోవరంలో విడిచాడు. ఆ చేప ఆ సరోవరంలో రెండు యోజనములంత పెద్దదిగా మారింది. ఆ సరోవరంలో ఇమడలేక రక్షించు, రక్షించు అని ఆక్రందన చేసింది. అప్పుడు రాజు దాన్ని గంగలో వేయగా, అది అచ్చట ఆ నది నిండుగా సరిపడునంతగా పెరిగిపోయింది. అప్పుడు రాజు దాన్ని సముద్రంలో విడిచి పెట్టగా, అది సముద్రమంతటా వ్యాపించి కనబడెను. అప్పుడు రాజుకు భయం కలిగింది. చిన్న చేప ఇంత పెద్దదిగా మారిందంటే ఇది సామాన్యమైంది కాదు అని భావించి ఆ చేపను ఈ విధంగా ప్రశ్నించాడు.

....ఇంకా ఉంది




# ఐశ్వర్యయోగం

శ్రీ మహాగణాధిపతయేనమః శ్రీ మాత్రేనమః శ్రీ గురుభ్యోనమః

ఆరోగ్యమే ఐశ్వర్యంగా భావించి జీవించే భక్తజనావళికి ఈ ఐశ్వర్యయోగం అమృతకలశం. సద్భక్తుల హృదయాలలో చేరిన మాలిన్యాన్ని తొలగించడానికి, సకల ఆరోగ్యసంపదలు అందరికీ అందజేయడానికి, శ్రీ లలితాసహస్రనామాలనే కుసుమాలను ఐశ్వర్యయోగంగా మలచారు సద్గురువులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు. లలితా సహస్రనామాలు అందరికీ సుపరిచితమే కానీ, ఏ నామాన్ని పారాయణం చేస్తే, తమ జీవనగమనాన్ని మార్చుకోవచ్చో తెలియజేసేదే ఐశ్వర్యయోగం. సమస్త జనులకు ఇది దివ్య ఔషధము

## 349 . వందారు జనవత్సలా ( ఓం ఐం హ్రీం శ్రీం వందారు జన వత్సలాయై నమః )



నమస్కరించిన భక్త జనులపై పుత్ర ప్రేమ చూపిస్తుంది అని అర్థం. అమ్మవారికి అందరూ బిడ్డలే. కేవలం నమస్కారం చేసినంత మాత్రాన జీవులపై వాత్సల్యం చూపించే కరుణామూర్తి అమ్మ మాత్రమే.

### మంత్ర ప్రయోగం — ఫలితం

ఈ మంత్రాన్ని విడువక 40 దినాలు జపం చేసిన వారికి అమ్మవారి కరుణ లభిస్తుంది. అప్పుడు పిల్లలను తల్లిదండ్రులు, తల్లిదండ్రులను పిల్లలు ప్రేమిస్తారు. ప్రస్తుతం తల్లిదండ్రులు అనాధాశ్రమాల పాలవుతున్నారు. అటువంటి వారు ఈ మంత్రాన్ని జపించి బెల్లంతో వండిన ఏదైనా తీపిని అమ్మవారికి నివేదించి తాము తిని ఇతరులకు పెడితే పుత్ర పుత్రికలచే సేవింపబడి పూజలు అందుకుంటారు. పిల్లలు జపిస్తే తల్లిదండ్రుల ప్రేమకు, గురువుల ప్రేమకు పాత్రులవుతారు. రాణిస్తారు.

... మరొక నామార్థ వివరణ వచ్చే సంచికలో

# ఋషి చరిత్ర

## మహర్షి చ్యవన

భారత వేదసంప్రదాయంలో శతాబ్దాలుగా తన తపోనిష్ఠ, ధర్మపాలన, వైద్యజ్ఞాన ప్రవర్తన, దైవాధికార పునరుద్ధరణతో విశిష్ట స్థానాన్ని సంపాదించిన మహర్షుల్లో చ్యవన మహర్షి ఒకరు. ఆయన గాథ మహాభారతం, బ్రాహ్మణ గ్రంథాలు, దేవీభాగవతం, భాగవతపురాణం, పద్మపురాణం వంటి అనేక శాస్త్రాలలో అత్యంత పటిష్ఠంగా చెప్పబడింది. భృగువంశోత్పన్నుడైన ఈ మహర్షి, భారత ఋషివంశాల గౌరవస్థంభంగా నిలిచాడు.భృగుమహర్షి భార్య పులోమను పౌలోమ అనే రాక్షసుడు అపహరించగా, ఆ దుఃఖం-కోపం కారణంగా ఆమె గర్భంలోని శిశువు అకాలంలో బయటకు వచ్చాడు. అందుకే అతనికి "చ్యవన" (చ్యుతుడు——జారిపడినవాడు) అనే పేరు ఏర్పడింది.

శ్లో॥ "తతః స గర్భో నివాస్కుక్షౌ భృగుకులోద్వహః।
రోషాన్ మాతుశ్చ్యుతః కుక్షేచ్చ్యవనస్తేన సత్యభవత్॥"

శ్లో॥ "తం దృష్ట్వా మాతురుదరాచ్యుతమాదిత్యవర్చసం।
తద్రక్షో భస్మసాద్భూతం పాపాత్ పరిముచ్య తామ్॥"

ఈ శ్లోకాలు చ్యవన మహర్షి జననాన్ని ఎంత దివ్యంగా, ధర్మపరిరక్షణకు సూచనగా తీర్చిదిద్దుతాయో తెలియజేస్తాయి. చ్యవన మహర్షి భృగువు దగ్గర వేదాలు అభ్యసించి, అనంతరం బ్రహ్మదేవుని ఆశీర్వచనాలతో పరమజ్ఞానాన్ని పొందాడు. సత్పుర, పయోష్ని, ధోసి కొండ వంటి అనేక ప్రదేశాల్లో ఆయనకు సంబంధించి ఉన్న ఆశ్రమాలు ఇప్పటికీ పురాణసాక్ష్యంగా నిలిచాయి. దీర్ఘ తపస్సు కారణంగా ఆయన శరీరమంతా చీమల పుట్టలతో కప్పబడినంతగా ధ్యాననిష్ఠలో మునిగిపోయేవాడు. ఇదే సుకన్య – చ్యవన ఘట్టానికి మౌలికంగా మారింది.ఒక రోజు రాజు శర్యాతి తన కుమార్తె సుకన్యతో వనవిహారానికి మానస సరోవరానికి చేరాడు. అక్కడ చీమలపుట్టలో తపస్సులో ఉన్న చ్యవన మహర్షి కళ్ళలో కనిపించే రెండు కాంతులు చూసి, అవి పురుగులని భావించి సుకన్య పొడవడంతో మహర్షి కంటి చూపు కోల్పోయాడు. ఈ కారణంగా కోపంతో చ్యవనుడు శర్యాతి సైనికుల మలమూత్రసంచారాన్ని నిలిపేసాడు. దాని మూలాన్ని తెలుసుకున్న శర్యాతి, తన కుమార్తెను మహర్షికి సమర్పించి సేవచేయమని నిష్కపటంగా అడిగాడు. సుకన్య పాతివ్రత్యాన్ని అంగీకరించి చ్యవన మహర్షికి సేవాభారాన్ని చేపట్టింది. సుకన్యను చూసిన అశ్వినీకుమారులు ఆమె పాతివ్రత్యాన్ని పరీక్షించాలని నిర్ణయించారు. చ్యవనుడి అనుమతితో వారు ముగ్గురూ ఔషధజలంలో స్నానం చేసి యవ్వనులయ్యారు. సుకన్య జ్ఞానదేవిని ప్రార్థించి నిజమైన భర్తను గుర్తించింది. ఆమె నిష్ఠపై సంతోషించిన అశ్వినులు చ్యవన మహర్షికి యవ్వనాన్ని ప్రసాదించారు. ఈ సందర్భంలో చ్యవనుడు అశ్వినులకు యజ్ఞాలలో సోమరస పానహక్కు కల్పించాడు. ఇంద్రుడు అశ్వినులకు సోమరసభాగం ఇవ్వడాన్ని వ్యతిరేకించాడు. కోపంతో వజ్రాయుధాన్ని ఎత్తిపట్టి చ్యవనుడిపై ప్రయోగించగా, మహర్షి తపోబలంతో వజ్రం ఇంద్రుడి చేతుల్లోనే నిలిచిపోయింది. దీనితో చ్యవనుడు మద అనే మహారాక్షసుడిని సృష్టించాడు. మద ఇంద్రునిపై దాడికి సిద్ధమయ్యే సమయంలో భయపడి ఇంద్రుడు అశ్వినీలకు సోమరస హక్కును అంగీకరించాడు. ఈ ఘట్టం చ్యవన మహర్షి శక్తి, ధర్మపాలన ఆయన గొప్పతనాన్ని తెలియజేస్తాయి.

.ఇంకావుంది



# కాశీ కథలు

## దివోదాసుని వృత్తాంతం

**శివుడు ఢుంఢి గణపతిని స్తోత్రము చేసెను . ఆ స్తోత్రమును మనుషులు చేస్తే కలుగు శుభములను వివరించెను. ఆ తర్వాత కాశీ యందు 56 రూపములతో ఏడు ఆవరణలలో కొలువుదీరిన వినాయకుడిని ,ఆయన రూపములను దర్శించడం వల్ల కలుగు ఫలితములను వివరించెను**

| ఆవరణ | గణపతి నామము | దర్శనము వలన కలుగు ఫలితం |
|---|---|---|
| ద్వితీయ | లంబోదర వినాయకుడు | విఘ్నములు ఉండవు |
| ద్వితీయ | కూటదంత వినాయకుడు | విఘ్నములు నశిస్తాయి |
| ద్వితీయ | శాలకంటక వినాయకుడు | కాశీ లో విఘ్నములు ఉండవు |
| ద్వితీయ | కూష్మాండ వినాయకుడు | మహోత్పాతముల నుండి ఉపశమనము |
| ద్వితీయ | ముండ వినాయకుడు | విఘ్నములు తొలగుతాయి |
| ద్వితీయ | వికటదంత వినాయకుడు | గాణపత్య పదవి దక్కుతుంది |
| ద్వితీయ | రాజపుత్ర వినాయకుడు | పోగొట్టుకున్న రాజ్యము పొందును |
| ద్వితీయ | ప్రణవ వినాయకుడు | స్వర్గ వాసము |

కాశీ లో ద్వితీయ ఆవరణ నుండి భక్తులకు సర్వసిద్ధులను అనుగ్రహించి శుభములను కలుగజేస్తూ భక్తులను కాశీలో అనుగ్రహిస్తూ ఉన్నారు గణపతి. గణపతి స్వామి దుష్టులను, అభక్తులను దుర్మార్గులను కాశీ నుండి బయటకు పంపివేయును

..ఇంకాఉంది



# శ్రీ మయూరేశ్వర స్తోత్రమ్

పరబ్రహ్మరూపం చిదానందరూపం పరేశం సురేశం గుణాబ్ధిం గణేశం।

గుణాతీతమీశం మయూరేశవంద్యం గణేశం నతాః స్మో నతాః స్మోనతా స్మః ॥1॥

జగద్వంద్యమేకం పరాకారమేకం గుణానాం పరం కారణం నిర్వికల్పం।

జగత్పాలకం హారకం తారకం తం మయూరేశవంద్యం నతాస్మోనతాఃస్మ ॥2॥

మహాదేవసూనం మహాదైత్యనాశం మహాపురుషం సర్వదా విఘ్ననాశం।

సదాభక్తపోషం పరం జ్ఞానకోశం మయూరేశవంద్యం నతాఃస్మోనతాఃస్మః ॥3॥

అనాదిం గుణాదిం సురాదిం శివాయా మహాతోషదం సర్వదా సర్వవంద్యం।

సురార్యంతకం భుక్తిముక్తిప్రదానం మయూరేశవంద్యం నతా:స్మో నతాఃస్మః ॥4॥

పరం మాయినం మాయినామప్యగమ్యం మునిధ్యేయమాకాశకల్పం జనేశం।


అసంఖ్యావతారం నిజాజ్ఞాననాశం మయూరేశ వంద్యంనతా:స్మో నతాస్మః ॥5॥

అనేక  క్రియాకారకం శ్రుత్యగమ్యం త్రయీబోధితానేక కర్మాది బీజం।

క్రియాసిద్ధిహేతుంసురేంద్రాదిసేవ్యం మయూరేశపంద్యం నతాఃస్మో నతాస్మః ॥6॥

# గురుదేవుల జీవన కవనము

## షట్త్రిమ్శతి అధ్యాయః



పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గురువుగారు ఏలూరులో శ్రీ ప్రణవ పీఠమును స్థాపించారు.శ్రీ ప్రణవ పీఠం బెంగళూరు నగరం,హైదరాబాద్, కాశీ వంటి పవిత్ర ప్రదేశాలకు కూడా విస్తరించింది.గురువు గారు అష్టాదశ పురాణములను ఒకటికి రెండుసార్లు ప్రవచించారు.గురువుగారి అవధానాల పరంపర కొనసాగుతూనే ఉన్నది, అష్టావధానమైన, శతావధానమైనా గురువు గారి ప్రతిభకు వారే సాటి. గురువుగారు తీర్ధ యాత్రలు చేస్తూ,భక్తులతో చేయిస్తున్నారు. వందల మంది పిల్లలకు అక్షరాభ్యాసం స్వయంగా చేయించారు,వేల మందికి మంత్రమును ఉపదేశించారు.ఈ దేశం, ఆ దేశం అని లేకుండా తెలుగు వారు ఎక్కడ ఉంటే అక్కడికి వెళ్లి ధర్మబోధ చేస్తున్నారు.ధర్మానికి చిరునామాగా ఉన్న గురువు గారికి ఎన్ని సన్మానాలు చేసినా ఎన్ని బిరుదులు ప్రదానం చేసినా అది తక్కువే అవుతుంది.గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గురువుగారు పరమాత్ముని అనుగ్రహంతో భూమి పైన ఆవిర్భవించి తెలుగువారికి అనేక విధములైన బోధనలు చేసి ధర్మాన్ని నిలబెడుతున్నారు.నేటి తరాన్ని ధర్మం వైపు నడిపించటానికి ఆవిర్భవించిన సాక్షాత్ పరమశివుడే, వారి గురించి ఎంత చెప్పినా అది తక్కువే. గురువు గారి గురించి వారి మహిమ గురించి ఎంత తలుచుకున్నా వారి ధర్మపత్ని అన్నపూర్ణా స్వరూపిణి అయిన రంగవేణి అమ్మ గారి గురించి తలుచుకోకపోతే వారి చరిత్ర అసంపూర్ణంగానే ఉంటుంది.ఈరోజు గురువు గారు సనాతన ధర్మంలో చరిత్ర సృష్టించారు అంటే అమ్మ గారియొక్క తపశ్శక్తి కూడా ఒక కారణం. గురుదేవుల భక్తులను చిరునవ్వుతో పలకరిస్తూ, అందరికీ భోజనం స్వయంగా అందించే చల్లని తల్లి.అమ్మ సాక్షాత్తు గౌరీ దేవి స్వరూపం.గురు దంపతులు సాక్షాత్తు ఆది దంపతులు. వారి పాద పద్మాలను సేవించిన వారి జన్మ ధన్యం.

### సర్వేజనా సుఖినోభవంతు

### సమాప్తము